క్లుప్తంగా

ముక్తేశ్వరుడి సన్నిధిలో అఖండ అన్న సమారాధన


అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు

పాలకోడేరు: స్థానిక మోగల్లు రోడ్డు సుబ్రహ్మణ్యపురం పంతొట్టి శివాలయంలో మహాశివ రాత్రి వేడుకలు పురస్కరించుకుని గురువారం అఖండ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పరిసర గ్రామ ప్రజలు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

వైభవంగా సోమేశ్వరస్వామి కల్యాణం


అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని సోమేశ్వర జనార్ధన స్వామి ఆలయంలో మహా శివరాత్రి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) దంపతులు తెల్లవారుజామున స్వామి వారికి పట్టు వస్త్రాలను అందజేశారు. కల్యాణ మహోత్సవంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యేల అంజిబాబు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన మహా శివరాత్రి ఉత్సవాలు


మార్కండేశ్వరుని ఆలయంలో పూర్ణాహుతి చేసిన దృశ్యం

ఆకివీడు: మహాశివరాత్రి సందర్భంగా పలు శివాలయాల్లో గురువారం పూర్ణాహుతి, త్రిశూల స్నానం, ఏకాంత సేవ కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక రాజ రాజేశ్వరి సహిత మార్కండేయేశ్వరస్వామి ఆలయంలో మూడు రోజులుగా జరిగిన రుద్ర హోమం పూర్ణాహుతితో గురువారం ముగిసింది. మధ్యాహ్నం త్రిశూల స్నానం, రాత్రి స్వామి వారి ఏకాంత సేవలు ముగిశాయి. సిద్ధాపురం గ్రామంలోని రామ లింగేశ్వరస్వామి ఆలయంలో అఖండ అన్నసమారాధన నిర్వహించారు. వెంకట లింగేశ్వరస్వామి ఆలయంలో త్రిశూల స్నానం, పవళింపు సేవలు నిర్వహించారు. శుక్రవారం అఖండ అన్న సమారాధన జరుగనుందని ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్య రవి చెప్పారు. స్థానిక సాలిపేటలోని వీరభద్రస్వామి ఆలయంలో బుధవారం రాత్రి భక్తులు నిప్పుల గుండం తొక్కారు.

కోడి పందేల శిబిరంపై దాడి

యలమంచిలి: స్థానిక పల్లిపాలెంలో కోడి పందేలు వేస్తున్నారనే సమాచారంపై దాడి చేసి ముగ్గురు వ్యక్తులను గురువారం అదుపులోనికి తీసుకున్నట్లు ఎస్సై కర్ణీడి గుర్రయ్య తెలిపారు. వారి వద్ద నుంచి రూ.3070 నగదు, ఒక కోడి, ఒక కోడి కత్తి స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అక్రమంగా మద్యం నిల్వ చేసిన నలుగురి అరెస్ట్

నరసాపురం: సుంకం చెల్లించని మద్యం బాటిళ్లు నిల్వ చేసి ఉండటం, అంతేకాకుండా అక్రమంగా మద్యం అమ్మకాలు సాగిస్తున్నారన్న నేరంపై నలుగురిని అరెస్ట్ చేసినట్టు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్(ఏలూరు) కేవీఎస్ ప్రభుకుమార్ తెలిపారు. గురువారం పట్టణంలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముందస్తు సమాచారం మేరకు సీఐ ఎస్ రాంబాబు, సిబ్బందితో కలసి దాడి చేయగా కొప్పర్రులోని చెరువు వద్ద 86 అట్టపెట్టెల్లో ఉంచిన 4,125 మద్యం బాటిళ్లు లభించాయని చెప్పారు. ఈ కేసులో బి.జయరాజు, గొల్లమందుల రాజబాబు, కత్తిమండ జయబాబు, దిడ్ల రామకృష్ణలను అరెస్ట్ చేశామన్నారు. యానాం ప్రాంతానికి చెందిన కె.భరత్‌రెడ్డి అనే మరో వ్యక్తి హస్తం ఈ వ్యవహారంలో ఉందని, అతని కోసం గాలిస్తున్నామన్నారు. వీరికి మద్య బాటిళ్లు సరఫరా చేసింది అతనేనని విచారణలో తేలిందన్నారు. సమావేశంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సీహెచ్ అజయ్‌కుమార్‌సింగ్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ (భీమవరం) ఆర్‌వీ ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

నేటితో ఈ-కేవైసీ ప్రక్రియ ముగింపు

అత్తిలి: దాళ్వా ఈపంట నమోదుకు సంబంధించి ఈ కేవైసీ ప్రక్రియ నేటితో ముగుస్తుందని మండల వ్యవసాయాధికారి టీకే రాజేష్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ-కేవైసీ చేయించుకోని రైతులు సమీప రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జ్ వద్ద ఈ కేవైసీ నమోదు చేయించుకోవాలని కోరారు.

నీరుపేదలు

- చుట్టూ చెరువులు..అయినా తాగునీటికి కటకటే
- ఆక్వా వ్యర్థాలతో తప్పని ఇబ్బందులు

ఉండి: వేసవి వచ్చిందంటే చాలు నియోజకవర్గంలోని ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరిగిన ఆక్వా కల్చర్ కారణంగా గ్రామ శివారుల్లో పెద్ద ఎత్తున చెరువులు ఉన్నా గుక్కెడు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. పంచాయతీల్లోని తాగునీటి చెరువులు ఆక్వా వ్యర్థాల కారణంగా కలుషితం కావడంతో వేసవిలో తాగునీటికి ఇబ్బందులు తప్పడం లేదని చెబుతున్నారు. నియోజకవర్గంలోని 72 గ్రామాల్లో ఒకటి అర తప్ప మిగిలిని అన్ని గ్రామాల్లో ఆక్వా కల్చర్ విచ్చలవిడిగా పెరిగిపోతుంది. ఆక్వా చెరువుల తవ్వకాల్లో అధికారుల చేతివాటం కారణంగా రైతులు ఇష్టానుసారం చెరువులు తవ్వేస్తున్నారు. ఆక్వా చెరువుల తవ్వకాల్లో ప్రధానంగా ఇన్‌లెట్, అవుట్‌లెట్‌లను జాగ్రత్తగా పరిశీలించాలి. ఆ సదుపాయం ఉన్న చెరువు తవ్వకాలకు అనుమతులు ఇవ్వాలి. కానీ ఆఫీసు నుంచి కాలు బయట పెట్టకుండానే ఆక్వా చెరువుల తవ్వకాలకు అనుమతులు ఇచ్చేయడంతో ఆక్వా రైతులు వ్యర్థాలను పంట కాలువలు, పంట బోదెల్లోకి విడిచిపెడుతున్నారు. దీంతో చెరువుల్లో వాడే రసాయనాలు, ఆక్వా వ్యర్థాలు నేరుగా పంట కాలువల్లో కలిసిపోయి తాగునీటి చెరువులకు చేరుతున్నాయి. దీని వల్ల పంచాయతీ తాగునీటి చెరువులు కాలుష్య కోరల్లో చిక్కుకుంటున్నాయి. అయితే ఈ కాలుష్య నీటినే ప్రజలకు సరఫరా చేయడంతో వారు రోగాల బారిన పడిపోతున్నారు.

అదనపు భారం

ఇప్పటికే ఇంటింటికీ కుళాయి అందించిన పంచాయతీలకు నెలవారీగా వినియోగదారులు బిల్లులు చెల్లిస్తున్నారు. నీటిని వాడుకున్నా వాడుకోకపోయినా కనెక్షన్ తొలగిస్తారేమో? అనే భయంతో బిల్లులు చెల్లిస్తున్నారు. కానీ కుళాయిల ద్వారా స్వచ్ఛమైన తాగునీరు రాకపోవడంతో, ఫిర్యాదులు చేసినా ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో తాగునీటిని కొనుగోలు చేసుకుని తాగుతున్నారు. గ్రామాల్లోని పంచాయతీ చెరువులు, ఓహెచ్‌ఎస్ఆర్ వాటర్ ట్యాంకులు అలంకారప్రాయంగానే మిగిలిపోబోతున్నాయి. ఎందుకంటే గ్రామ పంచాయతీ అందించే రక్షిత మంచినీరు సురక్షితం కాకపోవడంతో దానిని తాగేందుకు ఎవ్వరూ ఆసక్తి చూపడం లేదు. ప్రతిరోజూ ప్రైవేటు ఆర్‌ఓ ప్లాంట్‌ల వద్ద రూ.20 నుంచి రూ.40 చెల్లించి మంచి నీటిని ప్రతీ కుటుంబం కొనుగోలు చేసుకుని తెచ్చుకుంటున్నారు.



పాములపర్రులో తాగునీరు కలుషితం కావడంతో బాగు చేసేందుకు ఎండగట్టిన చెరువు, ఉండిలోని ఓహెచ్‌ఎస్ఆర్ వాటర్ ట్యాంక్

వేసవిలో తాగునీరు ఎలా?

ఇప్పటికే కాలుష్య కోరల్లో చిక్కుకుపోయిన తాగునీటి చెరువులు వేసవిలో ఆయా గ్రామ పంచాయతీలు ప్రజలకు తాగునీరు అందించడం ఇబ్బందిగానే మారే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. నీరు పారుతున్న దృష్ట్యా ఎలాంటి ఇబ్బంది లేకుండా చెరువుకు నీరు చేరుతుంది. పాత నీరు పోయి కొత్త నీరు వస్తుంది.అయితే వేసవిలో సుమారు 40 రోజులు పాటు కాలువలు కట్టేస్తారు. కాబట్టి వారం పది రోజుల్లోనే చెరువుల్లోని నీరు పసర్ల బారిపోయి తాగేందుకు దుర్గంధం వెదజల్లే అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయి. వీటిని దృష్టిలో పెట్టుకుని అధికారులు,ప్రజాప్రతినిధులు ఎటువంటి చర్యలు తీసుకుంటారో? ఎదురుచూడాలి.

ప్రజల బాధలు వర్ణనాతీతం



వేసవి వచ్చేసరికి ప్రజలకు తాగునీటి ఇబ్బందులు చాలా తలెత్తుతున్నాయి. ఒకవైపు కాలువలకు నీటి సరఫరా నిలిపివేయడంతో పాటు ఒంటి పూట రక్షిత మంచినీరు సరఫరా చేయడంతో ప్రజల ఇబ్బందులు వర్ణానాతీతంగా ఉంటున్నాయి. అయితే పంటకాలువల్లో నీరు కలుషితం కాకుండావుండేలా చర్యలు తీసుకుంటే చెరువుల్లోనీరు నిలువ ఉంటుంది.

– వద్రే ముసలయ్య, పాములపర్రు

ఆక్వా చెరువులను కట్టడి చేయాలి



విచ్చలవిడిగా ఆక్వా చెరువుల తవ్వకాలకు అక్రమ అనుమతులిచ్చి ఇష్టానుసారం చెరువులు తవ్వేడమే తాగునీటి కాలుష్యానికి కారణం. చెరువు తవ్వకాల్లో జాగ్రత్తలు పాటించడంతో పాటు ఆక్వా వ్యర్థాలు చెరువుల్లో కలవనీయకుండా అధికారులు కట్టుదిట్టంగా వ్యవహరించాలి. వేసవిలో అయినా తాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలి.

– అంగర రాంబాబు, ఉండి

లయన్స్ క్లబ్ ద్వారా సేవా కార్యక్రమాలు

ఉండి: లయన్స్ క్లబ్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు అన్నారు. గురువారం ఉండిలో పర్యటించిన వేణుబాబు పేదలకు దుప్పట్ల పంపిణీ, సన్‌రైజ్ వృద్ధాశ్రమానికి రూ.10 వేలు ఆర్థిక సాయం, ఉండి జడ్పీ హైస్కూల్ విద్యార్థులకు పౌష్టికాహారం కోసం రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఉండి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సత్తి బ్రహ్మారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోనే ఉండి లయన్స్‌క్లబ్ తన ప్రత్యేకతను చాటుకుందన్నారు. కార్యక్రమంలో ఆర్వీ సూర్యనారాయణరాజు, ఆర్‌సీ కృష్ణమూర్తి, జెడ్‌సీ కృష్ణంరాజు, శివరామరాజు, నరసరాజు, గాదిరాజు రంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పుష్ప యాగోత్సవం

వీరవాసరం: మహాశివరాత్రి సందర్భంగా మండల వ్యాప్తంగా ఉన్న శివాలయాల్లో గురువారం శ్రీ పుష్పయాగోత్సవం ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రమైన వీరవాసరంలో శ్రీ వీరేశ్వర, విశ్వేశ్వర స్వామి ఆలయంలో, రాయకుదురులో ఉమామూలేశ్వర స్వామి ఆలయంలోనూ, తోలేరులో రుద్రేశ్వర స్వామి ఆలయంలో, కొణితివాడలో ఉమారామలింగేశ్వరస్వామి ఆలయాల్లో ఘనంగా పుష్పయాగోత్సవాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. రాయకుదురులో ఉమామూలేశ్వరస్వామి ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహించారు. అడ్డాల వెంకటేశ్వరరావు, కవురు శ్రీనివాస్ దంపతులు, అడ్డాల శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

రాళ్లచెరువుకు మోక్షం కల్పించాలి

ఆకివీడు: స్థానిక గుమ్ములూరు రోడ్‌లోని ఎమ్మార్వో ఆఫీస్ సమీపంలో ఉన్న రజకుల రాళ్లచెరువుకు మోక్షం కల్పించాలని ఆ రజక సంఘం మండల అధ్యక్షులు భీమవరపు మహంకాళి మొరపెట్టుకున్నారు. గురువారం రాళ్లచెరువుకు ఉన్న ఇన్‌లెట్, అవుట్‌లెట్‌లను పరిశీలించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చెరువులోకి నీరు వచ్చే అవకాశం లేదని చెరువులోని మురుగునీరు బయటకు వెళ్లే మార్గం పూడుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు మార్గాలూ ఆక్రమణలకు గురై నీటి ప్రవాహానికి అడ్డంగా ఉన్నాయని పేర్కొన్నారు. దీంతో చెరువులో నీరు పూర్తిగా కలుషితమై బట్టలు ఉతికేందుకు ఉపయోగకరంగా లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నగర పంచాయతీ అధికారులు స్పందించి రజకులకు కేటాయించిన రాళ్లచెరువుకు అవుట్‌లెట్, ఇన్‌లెట్ మరమ్మతులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

3 నుంచి డీఎన్నార్ కళాశాలలో శారీస్ స్క్రీన్ ప్రింటింగ్ కోచింగ్

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఉచిత శారీస్ స్క్రీన్ ప్రింటింగ్ డిజైనింగ్ కోచింగ్ నిర్వహించనున్నట్లు నిర్వాహకురాలు జ్యోతి గురువారం విలేకరులకు తెలిపారు. ఐక్యూఏసీ, ఉమెన్ ఎంపవర్‌మెంట్ అండ్ కామర్స్ డిపార్ట్‌మెంట్ వారి ఆధ్వర్యంలో మహిళల కోసం ఈ కోచింగ్ ఉచితంగా నిర్వహిస్తున్నామన్నారు. మార్చి 3, 4 తేదీల్లో రెండు రోజులు పాటు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ ఈ కోచింగ్ ఉంటుందన్నారు. ఈ కోర్సు నేర్చుకోవడానికి ఎలాంటి విద్యార్హతలు అవసరం లేదని, కోర్సు నేర్చుకోవడానికి వచ్చే మహిళలు డార్క్ అండ్ లైట్ కలర్ క్లాత్‌లు తెచ్చుకోవాలని సూచించారు. నేర్చుకోవడానికి అవసరమైన మెటీరియల్ తామే అందిస్తామని మెటీరియల్ కోసం రూ.300 చెల్లించాలని స్పష్టం చేశారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతం

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు భీమవరం పట్టణంలో ప్రశాతంగా ముగిసాయి. భీమవరం పట్టణంలో మొత్తం ఓటుర్లు10,655 మంది ఓటర్లు కాగా గురువారం జరిగిన ఎన్నికల్లో 6,692 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీంతో భీమవరం పట్టణంలో 62.81 శాతం పోలింగ్ నమోదైంది.

ప్రశాంతంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

భీమవరం అర్బన్: ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయని తహసీల్దార్ రావి రాంబాబు అన్నారు. భీమవరంలో చింతలపాటి బాపిరాజు హైస్కూల్, లూథరన్ హైస్కూల్, మహాత్మాగాంధీ ఎలిమెంట్రీ స్కూల్, పీఎస్ఎమ్ గరల్స్ హైస్కూల్‌ల్లో 13 పోలింగ్ స్టేషన్లు ఏర్పాట్లు చేశామన్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు ఎన్నికలు నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్, రెవెన్యూ తదితర శాఖల పర్యవేక్షణలో పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించామన్నారు.

కాళ్ల: ఉమ్మడి తూర్పు పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు కాళ్ళ మండలంలో గురువారం ప్రశాంతంగా ముగిశాయి. కాళ్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (మెయిన్)లో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ బూత్ లలో 1465 మంది ఓటర్లకు గాను 1028 మంది పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తహసీల్దార్ జి.సుందర్ సింగ్ తెలిపారు. 70.17 శాతం ఓటింగ్ జరిగినట్లు ఆయన స్పష్టం చేశారు. భీమవరం ఆర్డీఓ ప్రవీణ్ కుమార్ రెడ్డి ఎన్నికల ఓటింగ్ సరళిని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

పాలకోడేరులో..

పాలకోడేరు: మండలంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతంగా సాగింది. గురువారం నిర్వహించిన పోలింగ్ 66.47 శాతం జరిగినట్లు ఎన్నికల పరిశీలన అధికారి, మండల తహసీల్దార్ ఎన్. భారతి విజయలక్ష్మి తెలిపారు. మండల వ్యాప్తంగా 2374 ఓటర్లు ఉండగా 1578 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు తెలిపారు.

ఆకివీడులో..

ఆకివీడు: పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జరిగిన పోలింగ్ గురువారం మండలంలో ప్రశాంతంగా సాగింది. మండలంలో 74 శాతం ఓట్లు పోలయ్యాయి. మొత్తం ఓటర్లు 2046 ఉండగా 1535 ఓట్లు పోలయ్యాయి. మండలంలోని అయిభీమవరం గ్రామానికి చెందిన డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణంరాజు తన ఓటు వేశారు. పోలింగ్ బూత్ వద్ద కూటమి నాయకులు హడావిడి కన్పించింది. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి జుత్తిగ నాగరాజు ఓటింగ్‌ను పరిశీలించేందుకు నాయకులతో వచ్చారు. పోలింగ్ బూత్‌కు 100 అడుగుల దూరంలో ఏ విధమైన ప్రచారాలు చేయకూడదని నిబంధన ఉన్నప్పటికీ పోలింగ్ బూత్ సమీపంలో నాయకుల హడావుడి కనిపించింది.

ఉండిలో..

ఉండి: ఉండిలో ఎమ్మెల్సీ పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. ఉండి జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన ఎమ్మెల్సీ పోలింగ్‌లో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదు. ఉండి మండలంలో 1542 ఓట్లుకు గాను 1059 ఓట్లు అనగా 69.12 శాతం నమోదైనట్లుగా తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. ఉండి పోలింగ్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ నయీం సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు.


ఉండి: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ నయీం


భీమవరంలో ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లు


భీమవరం అర్బన్: ఓటు హక్కును వినియోగించుకునేందుకు లైన్‌లో నిలబడ్డ ఓటర్లు


కాళ్ల: పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న భీమవరం ఆర్డీఓ ప్రవీణ్ కుమార్ రెడ్డి


ఆకివీడు: పోలింగ్ కేంద్రం వద్ద ఓటు వేసేందుకు బారులు తీరిన పట్టభద్రులు

రెండు గ్రామాల్లో రీ–సర్వే బృందం పర్యటన

ఉండి: మండలంలో గురువారం రీసర్వే బృందం పర్యటించింది. ఈ సందర్భంగా చెరుకువాడ, అర్తమూరు గ్రామాల్లో పర్యటించిన బృందం సభ్యులు మాట్లాడుతూ కొందరు రైతులు ఉమ్మడిగా పెద్దపెద్ద చెరువులు తవ్వకాలు చేశారని, రీసర్వే సమయంలో సంబంధిత ఉమ్మడి చెరువుకు ఒకే ఎల్‌పీఎం (ల్యాండ్ పార్శిల్ నంబర్) నంబర్ ఇచ్చారన్నారు. అయితే ఉమ్మడిలో నుంచి రైతులు బయటకు వచ్చి తమ భూమి తమకు కావాలని కోరితే వారి పరిస్థితి ఏంటి? వారికి ఏ విధంగా వ్యక్తిగత ఎల్‌పీఎం నంబర్ కేటాయించాలి? అని జిల్లా బృందం గ్రామాల్లో పర్యటించి వివరాలు సేకరించారు. దీని కొరకు ఆయా గ్రామాల రైతులును పెద్ద పెద్ద చెరువుల వద్ద సమావేశపరచి ఆయా మండల, గ్రామ సర్వేయర్‌లతో సమావేశాలు నిర్వహించి పరిష్కార మార్గాలను అన్వేషిస్తున్నట్లు తెలిపారు. ఆర్డీఓ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ కుమారి, స్టేట్ ట్రైనింగ్ అకాడమి జేడీ సీహెచ్‌డీఎస్ఎన్ కుమార్, సెంట్రల్ సర్వే ఏడీ సీఎస్ఓ శ్రీనివాసరెడ్డి,జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి కొండా జాషువా తదితరులు పాల్గొన్నారు.


చెరుకువాడలో అధికారులతో మాట్లాడుతున్న రీ-సర్వే బృంద సభ్యులు

పర్యావరణాన్ని పరిరక్షించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): పర్యావరణాన్ని పరిరక్షించాలని మార్నింగ్ కాఫీ క్లబ్ కన్వీనర్ బొండా రాంబాబు, కో కన్వీనర్ ఓలేటి శ్రీనివాస్లు తెలిపారు. గురువారం శ్రీవిజ్ఞానవేదిక, భీమవరం పురపాలక సంఘం ఆధ్వర్యంలో శ్రీరాంపురం రోడ్డులోని తాడిమళ్లవారి కాంప్లెక్స్ వద్ద ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన సదస్సు నిర్వహించారు. గుడ్డ సంచులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధాన్ని ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ నాగరాణి ఆదేశాల మేరకు ప్లాస్టిక్ నిషేధంపై వాడవాడలా అవగాహన సదస్సులు, ర్యాలీలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పున్నాని కనకయ్య, బొండా హనుమంతరావు, కనగర్ల కిషోర్, కంచర్ల భాస్కర్ గుప్తా, పులపర్తి రామకృష్ణ, బంగారు ప్రసాద్, బొండాడ మనీష్, కొల్లేపర్ల సుబ్బారావు, కురిశెట్టి శ్రీనివాస్ అప్పారావు, చవ్వ శ్రీనివాస సుబ్బారావు, డీఎన్నార్ వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.


ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

వాక్యజ్యోతి పోస్టర్ల ఆవిష్కరణ

పెంటపాడు: మార్చి 5,6 తేదీల్లో జట్లపాలెం గ్రామంలో వాక్యజ్యోతి చర్చి ఆధ్వర్యంలో సువార్త స్వస్థత సభలు నిర్వహించనున్నట్లు ప్రవక్తిని కొమ్మిశెట్టి అమ్మాజీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సమావేశాలకు సంబంధించి పడాల చర్చిలో గురువారం పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చర్చిసంఘ సభ్యులు, సేవకులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సమావేశాలను పరిసర గ్రామాల భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా పాస్టర్లసంఘ నాయకులు కొమ్మిశెట్టి జాజిరాజు, ఘనరాజు, సువార్తగాయకులు జాషువా గరికి పాల్గొంటారని ఆమె తెలిపారు.

కుళాయిల ద్వారా మురుగునీటి సరఫరా

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని కొన్ని వార్డుల్లో కుళాయి నీరు పసర్లుతో సరఫరా అవుతూ కుళ్లు కంపు కొడుతుందని ఆయా ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు. స్థానికంగా ఆనాల చెరువు గట్టు ట్యాంకు, ఎమ్మార్వో ఆఫీసు వద్ద ఉన్న రక్షిత మంచినీటి ట్యాంకుల నుంచి కుళ్లిన నీరు సరఫరా అవుతుందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. పసర్లుదేరిన నీటిలో బ్లీచింగ్ చల్లడం ద్వారా నీరు కుళ్లిపోయి ఉంటుందని పలువురు అనుమానం వ్యక్తం చేస్తుండగా, చెరువుల్లోని నీటిని నేరుగా పంపింగ్ చేస్తుండడం వల్ల కూడా ఈ విధంగా వచ్చే అవకాశం ఉందని స్థానికులు చెబుతున్నారు. ముఖ్యంగా పైప్‌లైన్ లీకేజీ వల్ల ఈ దుస్థితి ఏర్పడిందని మండిపడుతున్నారు. మాదివాడ, సాలిపేట, సంతపేట, ముస్లిం వీధి, జవహర్ పేట తదితర ప్రాంతాల్లో కుళాయిల ద్వారా మురుగునీరు సరఫరా అవుతుందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇటీవల నగర పంచాయతీ సర్వసభ్య సమావేశంలో మాదివాడకు చెందిన కౌన్సిలర్ నిమ్మల నాగు, మోటుపల్లి కుమారి, సంతపేట, సాలిపేటకు చెందిన కౌన్సిలర్లు కుళాయిల ద్వారా మురుగునీరు వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.అయినప్పటికీ నగర పంచాయతీ కమిషనర్, అధికారులు పట్టించుకోవడంలేదని ఆయా ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు.


కుళాయిల ద్వారా సరఫరా చేసిన నీరు ఇదే

లక్షల్లో వ్యయం.. నెరవేరని లక్ష్యం

కాళ్ల: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు, స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించినా క్షేత్రస్థాయిలో అందరి నిర్లక్ష్యంతో ఆచరణలోకి రావడం లేదు. నియోజకవర్గంలోని గ్రామాల్లో నిర్మించిన చెత్త నుంచి సంపద కేంద్రాలు నిరుపయోగంగా ఉండి, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారి పోయాయి. నియోజకవర్గంలో కొన్ని గ్రామాల్లో డంపింగ్ యార్డ్ లను ఉపయోగిస్తున్న కొన్ని గ్రామాల్లో నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారు. దీంతో ఎవరికి వారు రోడ్డు పక్కన చెత్త వేయడంతో ప్రయాణికులు వాహనదారులు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ జనాభా బట్టి రూ.5 లక్షల నుంచి రూ.15 లక్షలవరకూ వెచ్చించి గ్రామాల్లో షెడ్లు నిర్మించారు. నియోజకవర్గంలోని కాళ్ల, ఉండి, పాలకోడేరు, ఆకివీడు మండలంలోని పలు గ్రామాల్లో తడి, పొడి చెత్త సేకరించి సేంద్రియ ఎరువుగా మార్చే ప్రక్రియలో భాగంగా లక్షల వ్యయంతో నిర్మించిన సంపద కేంద్రలు నిరుపయోగంగా మారాయి. సంపద సృష్టించే కేంద్రాలు అలంకారప్రాయ కేంద్రాలుగా మారాయి. గ్రామంలో సేకరిస్తున్న చెత్త, వ్యర్థాలను కాలువ గట్లు, రహదారులు పక్కన గుట్టలుగా వేసి, నిప్పు పెడుతున్నారు. అధికారులు మాత్రం డంపింగ్ యార్డ్ లను వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పడం విశేషం.


నిరుపయోగంగా ఉన్న డంపింగ్ యార్డు


బొండాడపేట గ్రామంలో పొలాలకు వెళ్లే దారిలో రోడ్డు పక్కన వేసిన చెత్త

కార్మికులు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): కార్మిక వర్గం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఐఎఫ్‌టీయూ ఉమ్మడి జిల్లా సహాయ కార్యదర్శి మామిడి దానవర ప్రసాద్ పిలుపునిచ్చారు. ఎఫ్‌టీయూ రాష్ట్ర స్థాయి విలీన సభ వాల్ పోస్టర్ ఆవిష్కరణ గురువారం పట్టణంలో నిర్వహించారు. దానవరప్రసాద్ మాట్లాడుతూ 2013లో కొన్ని కారణాలు వల్ల ఐఎఫ్‌టీయూ రెండుగా చీలిపోయిందని తెలిపారు. రెండు జాతీయ కమిటీలు చర్చలు జరపినట్లు చెప్పారు. ఒకే ఐఎఫ్‌టీయూగా రూపుదిద్దుకోవడానికి మార్చి 2వ తేదీన రాజమండ్రిలోని పుష్కరాలు రేవు వద్ద చందా సత్రంలో సభ జరుగుతుందని, సభకు జాతీయ ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఎస్.వెంకటేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొంటారని, సభను జయప్రదం చేయాలని కోరారు. దేశంలో పాసిస్ట్ ప్రమాదం పెరుగుతుందని, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఖ్య పెరగడం, ప్రభుత్వ రంగంలో కనీస వేతనాలు లేకపోవడం, స్కీమ్ వర్కర్స్ వెట్టి చాకిరీ చేయించడం శోచనీయమన్నారు. ఐక్య ఉద్యమాలు నిర్మించేందుకు ఐఎఫ్‌టీయూ ఒకే నిర్మాణం కింద, ఒకే కమిటిగా ఏర్పడి విలీనం అవుతుందని, విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో పి.రాము, చిన్నరెడ్డి, సుబ్బారావు, నాగేశ్వరరావు, రమణ, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు